సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 20 । జనవరి । 2023



హుండీ ఆదాయం లెక్కింపు

కాళ్ల: కాళ్లకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 101 రోజులకు రూ.24,43,990 ఆదాయం సమకూరింది.



ఆకట్టుకున్న బుర్రకథ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శ్రీదేవి మహంకాళమ్మ తల్లి జాతరలో భాగంగా ఏర్పాటుచేసిన శ్రీదేవి కళా సమితి వారి వీరాభిమన్యు బుర్రకథ ఆకట్టుకుంది.



శ్రీవారి పథకాలకు విరాళం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న పథకాలకు ముగ్గురు మహిళా భక్తులు వేర్వేరుగా రూ.3,00,000 విరాళంగా అందజేశారు.

సిరుల తల్లి.. కల్పవల్లి

వైభవంగా మావుళ్లమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు


- నిత్యం ప్రత్యేక పూజలు
- సాంస్కృతిక, కళా ప్రదర్శనలు
- రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక
- రెండేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో వేడుకలు



మావుళ్లమ్మవారు



ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాల సెట్టింగులు



ఆలయంలో అమ్మవారి కళావేదికపై నృత్య ప్రదర్శన

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు, భక్తుల పాలిట కొంగు బంగారం భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 59వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13న ప్రారంభమైన ఉత్సవాలు వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రోజూ అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించేందుకు వస్తున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగకు జిల్లాకు వచ్చిన కుటుంబాలతో పాటు భక్తులు తరలివస్తున్నారు. దీంతో రోజూ ఆలయం వద్ద సందడి కనిపిస్తోంది.

అధిక సంఖ్యలో భక్తులు

ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలు, పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, భారీ సెట్టింగులు, డెకరేషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే రోజూ సాయంత్రం వేళ ఏర్పాటుచేసిన సాంస్కృతిక, నాటక, కళా ప్రదర్శనలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివస్తున్నారు. లైటింగ్, సెట్టింగ్స్ తిలకించడానికి వచ్చే వారితో సాయంత్రం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఆలయ ప్రాంగణం జనసంద్రాన్ని తలపిస్తోంది.

'కళా'వైభవం

ఉత్సవాల్లో భాగంగా రోజూ అమ్మవారి కళావేదికపై సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఏర్పాటుచేస్తున్న నాటక, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, హరి కథలు, బుర్ర కథలు, సినీ ఆర్కెస్ట్రాలు అలరిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా 25 రోజులపాటు నాటక ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటుచేశారు. వీటి ద్వారా రంగస్థల కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నారు.

విశేష కుంకుమ పూజలు

ఆలయంలో అమ్మవారికి సాధారణ నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. విశేష కుంకుమ పూజలు, హోమాలు చేస్తున్నారు. భక్తులు మనసారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేలా కమిటీ సభ్యులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

అన్నదానం.. మహోన్నతం

రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి భోజన ఇబ్బందులు లేకుండా ఉత్సవ నిర్వాహకులు ఆలయం వద్ద నిత్యాన్నదానాన్ని అందిస్తున్నారు. రోజుకు 1,000 మంది వరకు భక్తులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 25 రోజులపాటు అన్నదానం నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

ఏటా వస్తున్నాం



ఏటా అమ్మవారి ఉత్సవాలకు వస్తున్నాం. అమ్మవారి దర్శనం అదృష్టంగా భావిస్తున్నాం. రోజూ సాయంత్రం వేళ ఆలయం వద్ద ఏర్పాటుచేస్తున్న కళా ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆలయం వద్ద విద్యుద్దీప కటౌట్లు, సెట్టింగులు చాలా బాగున్నాయి.

– పి.భాగ్యజ్యోతి, భక్తురాలు, హైదరాబాద్

అన్నదానం బాగుంది



దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం నీరుల్లి కూరగాయ వర్తక సంఘం వారు నిత్యాన్నదానం చేయడం చాలా బాగుంది. భక్తుల ఆకలి తీర్చే కార్యక్రమంగా అన్నదానం మంచి కార్యక్రమం. ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి.

– ఎన్.శ్రీరామపండు, భక్తుడు, హైదరాబాద్

గణతంత్ర దినోత్సవానికి పక్కా ఏర్పాట్లు

కలెక్టర్ పి.ప్రశాంతి



భీమవరం(ప్రకాశం చౌక్): గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పక్కాగా పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలన్నారు. వేదిక, బారికేడింగ్, తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు చేయాలన్నారు. జేసీ జేవీ మురళి మురళి మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పనులు పూర్తి చేయాలని, ముందుగానే ప్రాంగణాన్ని సిద్ధం చేయాలన్నారు. డీఆర్వో దాసి రాజు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై మరింత నిఘా

మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేలా పట్టణ ప్రాంతాలు, కళాశాలల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సూచించారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ, అధికారులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా యాజమాన్యాలు పర్యవేక్షించాలన్నారు. మోనిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల వాడుతున్న విద్యార్థుల సమాచారం సేకరించాలన్నారు. మెడికల్ షాపులు, మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, వాటిని ప్రతినెలా కమిటీ సభ్యులు పర్యవేక్షించాలన్నారు. డ్రగ్స్, చైనా గుట్కా వంటి పదార్థాలు కళాశాల, పాఠశాలల ఆవరణల్లోని దుకాణాల్లో విక్రయించకుండా చూడాలన్నారు. డ్రగ్స్ వాడకంపై నిఘాను మరింత పెంచాలని కలెక్టర్ ఆదేశించారు.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సమస్యలపై సానుకూల స్పందన



సీఎం జగన్‌ను కలిసిన ఉమ్మడి జిల్లాల ఎన్‌జీఓ అధ్యక్షుడు శ్రీనివాస్

ఏలూరు (మెట్రో): రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం జగన్ హామీ ఇచ్చారని ఉమ్మడి జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. గురువారం సీఎం జగన్‌ను రాష్ట్ర నాయకులు బండి శ్రీనివాసరావుతో కలిసి శ్రీనివాస్ కలిశారు. ముఖ్యమంత్రి దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకువెళ్లారు. త్వరలోనే ఉద్యోగులకు ఒక డీఏ అందించేందుకు సీఎం నిర్ణయించారని శ్రీనివాస్ చెప్పారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత : డీటీసీ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీసీ ఉమామహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): రహదారి భద్రత అందరి బాధ్యత అని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంలో లారీ, ఆటో డ్రైవర్లు, కళాశాల విద్యార్థులు, ప్రజలకు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డీటీసీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాల్లో 45 శాతం ద్విచక్రవాహనాలవే ఉంటున్నాయని, ఎక్కువగా వాహనచోదకులు హెల్మెట్ ధరించకపోవడం కారణంగా కనిపిస్తోందన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్నారు. మద్యం తాగి వాహనాలను వేగంగా నడపటం కూడా ప్రమాదాలకు మరో కారణంగా చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, సరైన నైపుణ్యం లేకుండా వాహనాలను నడపటం, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపటం కూడా ప్రమాదాలకు కారణంగా కనిపిస్తున్నాయని, వీటిని నివారించాలని కోరారు. మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకట రమణ, కేఎస్ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం. రవి కుమార్, ఎస్ఎల్ఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు కౌంటర్లు

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో ఈనెల 24వ తేదీ వరకూ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌కు గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశామని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. రెండో విడతగా ఫిబ్రవరి 7 నుంచి 10 వరకూ అవకాశం అని, పదేళ్లుగా ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామాలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు



గుమ్ములూరులోని రామాలయంలో ఈఈ భాస్కరరావు

ఆకివీడు: జిల్లాలోని ఏడు రామాలయాల అభివృద్ధికి టీటీడీ రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్టు ద్వారకాతిరుమల ఈఈ డీవీ భాస్కరరావు తెలిపారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు కేటాయిస్తుందని, దాతల విరాళాలతో గ్రామాల్లో రామాలయాలు నిర్మిస్తున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో రామాలయాల నిర్మాణం పూర్తయ్యిందని, పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు వచ్చామన్నారు. మాజీ సర్పంచ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు మాట్లాడుతూ పురాతనమైన రామాలయం పునర్నిర్మాణానికి గ్రామస్తులు విరాళాలు అందజేశారని చెప్పారు.మాజీ సర్పంచ్ కోపల్లె సాయిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చిక్కాల చిన్నా, సుంకర శ్రీనివాస్, సుంకర నాగేశ్వరరావు, అప్పారావు, దేవస్థానాల ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పతనాన్ని చాటిన వేమన



వాలీబాల్ విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రులు కాకాణి, కారుమూరి

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

అత్తిలి: వేమన తన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలిపి, తెలుగుభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆరవల్లిలో యోగివేమన 98వ జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ వేమన తన రచనల ద్వారా అన్ని వర్గాలను ప్రభావితం చేశారన్నారు. 350 ఏళ్ల క్రితం జన్మించిన వేమన పద్యాలు పదికాలాలుగా గుర్తుండిపోయేలా ఉన్నాయన్నారు. ఆరవల్లిలో ఏటా వేమన జయంతిని పండగలా నిర్వహించడం అభినందనీయమన్నారు. వేమన పద్యాలను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ పెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేవరకూ విశ్రమించలేదన్నారు. సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశం ఎల్లలు దాటాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల వద్దకు ధైర్యంగా వెళుతున్నామంటే సంక్షేమ కార్యక్రమాలే కారణమని ఆయన అన్నారు.

ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగింది

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలతో విద్యారంగం అభివృద్ధి చెందుతోందన్నారు. అనంతరం వాలీబాల్ పోటీల విజేతలకు మంత్రుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. మంత్రులను వేమన ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. ముందుగా వేమన విగ్రహాన్ని మంత్రులు గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్, సర్పంచ్ వెలగల సుస్మిత, వేమన ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, సినీ నిర్మాత అచ్చిరెడ్డి, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ అబీబుద్దీన్, సత్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జీవిత సత్యాలను తెలిపేలా వేమన తత్వం



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ మురళి

భీమవరం(ప్రకాశం చౌక్): సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలు జీవిత సత్యాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేమన జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని, అందరూ భాగస్వాములయ్యారన్నారు. విగ్రహారాధనకు, కులాలకు, మతాలకు వేమన అతీతమని ఆయన అన్ని వర్గాలకు చెందిన వ్యక్తి అని కొనియాడారు. అన్నిరకాల సమాజ పరిస్థితులకు అద్దం పట్టేలా వేమన పద్య రచనలు ఉన్నాయన్నారు. జాయింట్ కలెక్టర్ జేవీ మురళి మాట్లాడుతూ వేమన ప్రజాకవి అని, పామరులు, పండితులను అలరించిన ఆయన కవిత్వం గొప్పదన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి వేమన పద్యాలు దోహదపడతాయన్నారు. డీఆర్వో దాసి రాజు, డీఈఓ ఆర్.వెంకటరమణ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

సాక్షి, భీమవరం: జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్మ్‌డ్ రిజర్వుడ్ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ ఆర్ఐ శ్రీకాంత్, ఏఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

పశు వైద్యానికి పెద్దపీట

- అందుబాటులో వ్యాధి నిర్ధారణ కేంద్రాలు
- వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో సదుపాయాలు
- లక్షలాది పశువులకు ప్రయోజనం



భీమడోలులో అగ్రి ల్యాబ్

జిల్లాలో పశువులు

గేదెలు	ఆవులు
5 లక్షలు	1.36 లక్షలు
గొర్రెలు	మేకలు
5.20 లక్షలు	1.90 లక్షలు
కుక్కలు	
10,200	

దెందులూరు: రాష్ట్రంలో పాడి పరిశ్రమను ప్రోత్సహించడంతో పాటు రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం పశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. పశువులకు వచ్చిన వ్యాధులను త్వరితగతిన నిర్ధారించి చికిత్స అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్‌లో పశుసంవర్ధక, వ్యవసాయ, ఆక్వా రంగాలకు సంబంధించిన పరీక్షలు చేస్తారు. ల్యాబ్‌లో ఒక గదిని ప్రత్యేకంగా పరీక్షలకు కేటాయించారు. ఒక ల్యాబ్ టెక్నిషియన్, ఒక ల్యాబ్ అంటెండర్ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తారు. జిల్లాలో నియోజకవర్గానికో అగ్రి ల్యాబ్‌ను ప్రభుత్వం మంజూరు చేసి నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ఏలూరు జిల్లాలో గోపన్నపాలెం, చింతలపూడి, భీమడోలు, కైకలూరు, కొయ్యలగూడెం, నూజివీడు ప్రాంతాల్లో అగ్రి ల్యాబ్ నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఏలూరులో హెడ్ క్వార్టర్‌గా వ్యాధి నిర్ధారణా పరీక్షా కేంద్రం సేవలందిస్తోంది. భీమడోలులో మాత్రం ఇటీవల ఈ ల్యాబ్ ప్రారంభం కాగా పరీక్షలు జరుగుతున్నాయి.

ల్యాబ్‌లో చేసే పరీక్షలు

- పేడ పరీక్ష
- రక్త పరీక్ష
- నాసిక సారాల పరీక్ష
- బాహ్య పరాన్న జీవుల పరీక్ష
- పొదుగు వ్యాధికి పాల పరీక్ష
- జీవ రసాయన పరీక్ష (గ్లూకోజ్, కాల్షియం, లివర్)



ల్యాబ్‌లో వైద్య పరీక్షలు చేసే గది

సీఎం మేలు మరువలేం



పశువులకు కూడా సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసేలా అగ్రి ల్యాబ్స్ ఏర్పాటు ఆలోచన బాగుంది. పశువులున్న రైతులందరికీ ఇది ధైర్యాన్నిస్తుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం. పశువులు ఆరోగ్యంగా ఉంటే పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది.

– పర్వతనేని సుధీర్, రైతు, మలకచర్ల


పశువులకు భరోసా



డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్ ద్వారా పశువులకు భరోసా కలుగుతోంది. ఒక వైపు సంచార పశు వైద్యసేవలు, మరో వైపు పశువులకు వ్యాధి నిర్ధారణా కేంద్రాల ఏర్పాటు అభినందనీయం. సీఎం జగన్‌కి వచ్చిన ఆలోచన శుభపరిణామం. ఈ సేవలను మరింత విస్తరించాలి.

– మేడూరి రంగబాబు, రైతు, కామవరపుకోట

అగ్రి ల్యాబ్స్ శుభపరిణామం



జిల్లాలో వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్ ఏర్పాటు శుభపరిణామం. ఇకపై సకాలంలో వేగవంతంగా పశువులకు వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. దీని ద్వారా పశువుల సంపూర్ణ ఆరోగ్యానికి కృషిచేయవచ్చు. రైతులు సంతోషంగా ఉంటారు. పాల ఉత్పత్తి సంతృప్తికరంగా ఉంటుంది.

– నెహ్రూబాబు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్

జనావాసంలోకి జింక పిల్ల



ముసునూరు- చాట్రాయి-విస్సన్నపేట సరిహద్దుల్లోని అడవిలో నుంచి ఏడాది వయసున్న జింక పిల్ల రమణక్కపేట నివాసాల వద్దకు బుధవారం రాత్రి వచ్చింది. స్థానికంగా ఉండే ట్రాక్టర్ డ్రైవర్ సతీష్ దానిని గుర్తించి రక్షించారు. గురువారం అటవీ శాఖ రేంజ్ అధికారి హరిగోపాల్ ఆధ్వర్యంలో నూజివీడు పశు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించి కొండపల్లి సమీపంలోని మూలపాడు అరణ్యంలో వదిలిపెట్టారు.

– ముసునూరు

22 నుంచి రథసప్తమి ఉత్సవాలు

- శోభనాచలుని సన్నిధిలో 10 రోజులపాటు ఉత్సవాలు
- 29వ తేదీన స్వామివారి దివ్య రథోత్సవం



శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయం

ఆగిరిపల్లి: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఆగిరిపల్లిలో వెలసి అనుపమాన ప్రాశస్త్యాన్ని చేకూర్చిన శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి మాఘమాస రథసప్తమి మహోత్సవాలకు ఈ నెల 22న అంకురార్పణ చేస్తారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మాఘమాస తిరునాళ్ల మహోత్సవాలకు ఉమ్మడి కృష్ణా జిల్లా వాసులతోపాటు పొరుగు జిల్లాల భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుంటారు. 10 రోజులు సాగే ఈ ఉత్సవాల్లో స్వామివారిని నిత్యం ఊరేగింపుగా తీసుకొచ్చి స్థానిక స్వామివారి కల్యాణ మండపంలో (పెద్దకొటాయి) కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు.

వారం రోజులపాటు నిర్వహణ

మాఘ శుద్ధ పాడ్యమి 22న సాయంత్రం 5 గంటలకు స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగింపుగా తీసుకొచ్చి పెళ్లి కుమారుని అలంకరణ చేసి రాత్రి 9 గంటలకు నిత్య కల్యాణం వేద పండితులు నిర్వహిస్తారు. 23న రాత్రి 8 గంటలకు నిత్య కల్యాణం, 24, 25, 26, 27వ తేదీల్లో రాత్రి 9 గంటలకు యథావిధిగా వివిధ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో స్వామివారి వాహనాలపై గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం నిత్య కల్యాణాలు నిర్వహిస్తారు. 28వ తేదీ రాత్రి ప్రభుత్వ సేవ, రాధాకృష్ణ కల్యాణం, భక్తుల దర్శనం, తిరుక్కల్యాణం జరుగుతాయి. తెల్లవారితే 29వ తేదీన స్వామివారిని 32 అడుగుల దివ్యరథంపై గ్రామంలోని నాలుగు మండపాల చుట్టూ గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు పోలీస్, రెవెన్యూ, దేవదాయశాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తారు.

వందేళ్ల నుంచి ఉత్సవాలు



స్వామివారి రథసప్తమి ఉత్సవాలు 100 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. పూర్వపు సంప్రదాయలను అనుసరించి స్వామివారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, విశేష కైంకర్యాలు, మాఘమాస అధ్యయనోత్సవాలు స్వామి అనుగ్రహంతో దేవదాయశాఖ ఆధ్వర్యంలో, భక్తుల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తాం.

– నాగినేని భవాని, ఆలయ ఈఓ

ఇంటింటా సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో మహిళ పొందిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఆకివీడు : మండలంలోని దుంపగడప గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



శ్రీనివాసులును సత్కరిస్తున్న ఎన్జీఓ సంఘం నాయకులు

తణుకు టౌన్: ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తణుకు పట్టణానికి చెందిన పి.శ్రీనివాసులు ఈనెల 18వ తేదీన విజయవాడలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఏపీ ఎన్జీఓ తణుకు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌వీ నరసరాజు, కేవీ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా తణుకు తాలూకా ఎన్జీఓ సంఘం నాయకులు అధ్యక్ష, కార్యదర్శులతోపాటు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, సహ అధ్యక్షుడు జున్నూరి శ్రీనివాసరావు, కోశాధికారి వైవీఎస్‌బీ రాయుడు, మహిళా అధ్యక్షురాలు భారతి, కేకే సుభాషిణి తదితరులు అభినందించారు.

ఉద్యోగి చేతివాటంపై విచారణ

వీరవాసరం: దూసనపూడి తపాలా కార్యాలయంలో అవకతవకలపై భీమవరం తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం గురువారం విచారణ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగికి పలువురు ఎస్బీ, ఆర్డీ, సుకన్య ఖాతాల్లో జమ చేయాలంటూ నగదు ఇచ్చారు. తమ ఫోన్లకు ఖాతాల్లో నగదు జమ చేసినట్టు మెస్సేజ్‌లు రాకపోవడంతో పలువురు ఆ ఉద్యోగిని నిలదీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాలేపల్లి, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి గ్రామాల్లోని ఖాతాదారులు బుధవారం కార్యాలయానికి వచ్చి తమ ఖాతాల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. వారి పాసు పుకాలను సుబ్రహ్మణ్యం పరిశీలించారు. గురువారం కూడా పలువురు ఖాతాదారులు పాసు పుస్తకాలతో దూసనపూడి తపాలా కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగి నుంచి నగదును రికవరీకి ప్రయత్నిస్తామని, అనంతరం ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుంటారని సుబ్రహ్మణ్యం తెలిపారు.

మద్యం షాపు వద్ద వ్యక్తి మృతి



రైల్వేగేటు సమీపంలో మద్యం షాపు వద్ద వ్యక్తి మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: మద్యం సేవించడానికి వచ్చిన వ్యక్తి షాపు వద్దే రోడ్డుపై పడి మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలోని రైల్వేగేటు సెంటర్ వద్ద జరిగింది. స్థానికుల వివరాలు ప్రకారం.. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన డి.శ్రీను (38) రైల్వేగేటు సెంటర్ వద్ద ఉన్న బ్రాందీ షాపు వద్దకు వచ్చాడు. అనారోగ్యంతో ఉన్న శ్రీను నడవలేక పక్కనే ఉన్న వ్యక్తితో మద్యం సీసా తీసుకురమ్మన్నాడు. మద్యం తెచ్చేలోపే కూర్చున్నచోటే శ్రీను కూలపడిపోయాడు. 108కు కాల్ చేయగా వచ్చిన సిబ్బంది అప్పటికే శ్రీను మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీను మృతదేహాన్ని తన ఇంటికి తరలించారు.

21న క్రాస్ కంట్రీ పోటీలు

దెందులూరు: గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాలలో ఈ నెల 21న ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ (10 కిలో మీటర్లు) పోటీలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పీవీకేడీ ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఫిబ్రవరి 12 నుంచి జరిగే అఖిల భారత అంతర్ యూనివర్శిటీ స్థాయి పోటీల్లో (బెంగుళూరు) ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ తరపున పాల్గొంటారని తెలిపారు. శుక్రవారం గోపన్నపాలెం కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. ప్రతిభ కనబరిచిన పది మంది బాలబాలికలను ఎంపిక చేస్తారని తెలిపారు.

నాలుగు కాసుల బంగారం చోరీ

సాక్షి, భీమవరం : స్థానిక టూటౌన్‌లోని చెక్కా వారి వీధిలో బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. చెక్కావారి వీధికి చెందిన జి.సింధు ఈనెల 18వ తేదీన తాము ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలకొట్టి బీరువాలోని నాలుగు కాసుల బంగారు ఆభరణాలను తీసుకువెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొందన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

రూ.10 లక్షల నగదు, ఆభరణాలు స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ మనోహరాచారి

నరసాపురం : పట్టణంలోని 10వ వార్డు జ్యోశ్యులవారి వీధిలో ఈనెల 15వ తేదీన తాళంవేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7.30 లక్షలు, 5.20 కాసుల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం పట్టణ పోలీసు స్టేషన్‌లో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ నిందితులను, కేసు వివరాలను మీడియా ముందు వెల్లడించారు. మూడు రోజుల్లోనే కేసు ఛేదించి, రూ.10 లక్షలు విలువైన సొత్తును రికవరీ చేశారు. ఈనెల 15న జ్యోశ్యులవారివీధికి చెందిన కొప్పర్తి వెంకటరత్నం సంక్రాంతి నేపథ్యంలో కుటుంబంతో కలిసి ఇంటికి తాళంవేసి ఊరెళ్లారు. అదేరోజు రాత్రి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.7.50 లక్షలు, 7.20 కాసుల బంగారు వస్తువులు దోచుకెళ్లారు. 16వతేదీన ఇంటిలో దొంగతనాన్ని గుర్తించిన వెంకటరత్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నరసాపురం డీఎస్పీ మనోహరాచారి నేతృత్వంలో నరసాపురం టౌన్ సీఐ జి.శ్రీనివాసయాదవ్, టౌన్ ఎస్సై కె.సుధాకర్‌రెడ్డి, భీమవరం క్రైమ్ సీఐ ఆకుల రఘు, ఎస్సై కె.రెహ్మాన్‌ల బృందంగా దర్యాప్తు చేపట్టింది. ముందుగా పాత నేరస్తుల కదలికలు పరిశీలించగా నరసాపురం పట్టణం రుస్తుంబాధకు చెందిన కొత్తపల్లి నరేష్ అనే వ్యక్తిపై అనుమానం వచ్చిందని ఎస్పీ చెప్పారు. నరేష్ నరసాపురం వీవర్స్ కాలనీకి చెందిన గుబ్బల భాస్కర్, కోనసీయ అంబేడ్కర్ జిల్లా కొత్తపేటకు చెందిన జీరా రమేష్‌లతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించామన్నారు. గురువారం పక్కా సమాచారంతో నరేష్‌ను అతని ఇంటి వద్ద ఇద్దరి అనుచరులను పట్టుకున్నట్టు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అత్యాచారయత్నం కేసులో నాలుగేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): అత్యాచార యత్నం కేసులో ముద్దాయికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.4 వేలు జరిమాన విధిస్తూ మచిలీపట్టణం 9వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి షేక్ మొహ్మద్ ఫజుల్లా గురువారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కల్లటూరు గ్రామానికి చెందిన చిట్టిపోతుల రంగన్న అదే గ్రామానికి చెందిన వివాహిత (23)ను అత్యాచారం చేసేందుకు ప్రయత్నించినట్లు 2018లో కేసునమోదైంది. దీంతో రంగన్నను రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటకొచ్చిన ముద్దాయి కోర్టు వాయిదాలకు సరిగా హాజరుకానందున కోర్టు నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ఇచ్చింది. దీనిపై ఆగిరిపల్లి ఎస్సై ఎన్ చంటిబాబు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి ముద్దాయిని కోర్టులోహాజరు పర్చారు. సాక్షులను విచారించిన అనంతరం గురువారం తుది తీర్పు వెలువరించారు. ఈ కేసులో పీపీ బి.వెంకన్న వాదనలు వినిపించారు. జడ్జి ఆదేశాల మేరకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

ట్రస్ట్ ముసుగులో ప్రభుత్వ భూముల ఆక్రమణ

కాళ్ల: కాళ్ల మండలం ప్రాతాళ్ల మెరక గ్రామంలో ట్రస్ట్ ముసుగులో ప్రభుత్వ భూములు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ప్రాతళ్లమెరక గ్రామ అధ్యక్షుడు వేగేశ్న బాలగణపతి వర్మ కోరారు. ఆయన తన సోదరుడు వేగేశ్న మాధవరాజుతో కలిసి జిల్లా కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీఓలకి గురువారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రాతాళ్లమెరకలో ట్రస్ట్ పేరుతో ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మించారని తెలిపారు. సర్వే నెంబరు 46లో జువ్వలపాలెం – కలవపూడి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పడమర వైపు ఊరులోకి వెళ్లే సిమెంటు రోడ్డుకు దక్షిణం వైపున గల విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ పొడవున పుంతను ఆక్రమించి, ప్రహరీ నిర్మించడం వల్ల రోడ్డు మార్గం ఇరుకైపోయిందని, ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. ఈ రోడ్డు మార్గంలో చేపల చెరువులకు భారీ వాహనాలతో మేతలను, పట్టుబడి పట్టిన ఆక్వా ఉత్పత్తులను తీసుకెళ్లాలని తెలిపారు. అక్రమంగా నిర్మించిన గోడను, సైకిల్ షెడ్డు తొలగించి రోడ్డును వెడల్పు చేయాలని కోరారు. సర్వే నెంబరు 23లోని లైబ్రరి బిల్డింగ్, సర్వే నెంబరు 55లో పుంతను ఆక్రమించి ట్రస్ట్ ఆఫీసు బిల్డింగ్ నిర్మించారని ఆరోపించారు. అక్రమాలకు అనుకూలంగా లేని వారి పిల్లలను విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నడుపుతోన్న కేవీకే రాజు విద్యానికేతన్ పాఠశాల నుంచి టీసీలు ఇచ్చి బహిష్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో స్కూలు, బస్టాప్, కల్యాణ మండపం వంటివి నిర్మించి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రస్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.

ఆక్వా చెరువుల పరిశీలనలో ఇంగ్లండ్ బృందం



ఆక్వా చెరువులను పరిశీలిస్తున్న ఇంగ్లండ్ బృందం

యలమంచిలి: యలమంచిలి మండలం కట్టుపాలెంలో తాళ్లూరి వంశీకృష్ణ అనే రైతు ఆక్వా చెరువులను గురువారం ఎంపెడ అధికారులు, ఇంగ్లాండ్ నుంచి వచ్చిన బృందం పరిశీలించింది. ఆక్వా సాగు విధానం, ల్యాబ్ రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ ఎల్ఎల్ఎన్ రాజు మాట్లాడుతూ మన దేశ ఆక్వా ఉత్పత్తులు ఇంతవరకు ఇంగ్లండ్‌కు వెళ్లలేదన్నారు. ఇంగ్లండ్ నుంచి బృందం మన ఆక్వా చెరువులను పరిశీలించడానికి రావడంతో ఎంపెడ అధికారులు ఇక్కడకు తీసుకొచ్చారని చెప్పారు. ఈ బృందం ఇచ్చే నివేదిక సంతృప్తికరంగా ఉంటే ఇంగ్లండ్‌కు రొయ్యలు ఎగుమతి అవుతాయని రాజు చెప్పారు.

ఆరుగురికి జైలుశిక్ష

పాలకొల్లు సెంట్రల్: కొట్లాట కేసులో ఆరుగురికి జైలు శిక్ష పడిందని సీఐ అఖిల్ జామా తెలిపారు. 2015లో పూలపల్లిలో జరిగిన ఓ తగాదాలో జాలెం భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. గురువారం కోర్టులో పీపీ మాదాసు జయసింధు వాదనలు వినిపించగా జడ్జి పి.భానుసాయి రామకృష్ణ, హరింద్రబాబులకు ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా, మిగిలిన నలుగురికీ ఆరు నెలలు సాధారణ జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

26న ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ర్యాలీ

ఏలూరు (టూటౌన్) : ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం మోసగించిందని ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు విమర్శించారు. కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ విజయవాడ జోన్ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలకు 15 సంవత్సరాల లీజు నిమిత్తం టెండర్ల ప్రక్రియకు ఏర్పాటు చేశామని ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ జోన్ పరిధిలోని వివిధ జిల్లాలో 28 ఖాళీ స్థలాలను గుర్తించామని పేర్కొన్నారు. ఏలూరులో 3, ద్వారకాతిరుమలలో 1, తాడేపల్లిగూడెంలో 2, మార్టేరులో 2, తునిలో 2, కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట, అంబాజీ పేట, రంగంపేట, కూచిపూడి, మోపిదేవి, మచిలీపట్నం, మైలవరంలలో ఒక్కొక్కటి, నందిగామలో 2, చల్లపల్లిలో 3, జగ్గయ్యపేటలో 4 స్థలాలను గుర్తించామని వివరించారు. ఈ టెండర్ల ప్రీ బిడ్ సమావేశం విజయవాడ పీఎన్‌బీఎస్‌లోని ఆర్టీసీ ప్రధాన సమావేశ మందిరంలో ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరై తమ అభిప్రాయాలు ఇవ్వడంతో పాటు సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

నిబంధనలు పాటించండి



భద్రతా నిబంధనలను వివరిస్తున్న ఎంవీఐ డీఎస్ఎస్.నాయక్

తాడేపల్లిగూడెం: వాహనాలను నడిపే సమయంలో భద్రతా పరమైన జాగ్రత్తలను విధిగా తీసుకోవాలని తాడేపల్లిగూడెం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డీఎస్.ఎస్.నాయక్ డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. 32వ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక ప్రాంతీయ రవాణా యూనిట్ కార్యాలయంలో గురువారం డ్రైవర్లకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. సీటు బెల్ట్ ధరించకుండా వాహనాలను నడుపరాదన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వాహనాలను నడిపే వారందరూ క్షేమంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు కృష్ణారెడ్డి మృతి



సత్తి వెంకట కృష్ణారెడ్డి (ఫైల్)

తణుకు: పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు సత్తి వెంకట కృష్ణారెడ్డి (62) గురువారం మృతి చెందారు. పట్టణంలోని చైతన్య ఆర్థోపెడిక్ ఆసుపత్రి నిర్వహిస్తున్న ఆయన గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఆయన నివాసంలో మృతి చెందారు. కృష్ణారెడ్డికి భార్య శారద, కుమారుడు వరుణ్‌రెడ్డి, కుమార్తె మాధురి ఉన్నారు. గతంలో తణుకు ఐఎంఏ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి పని చేశారు. కృష్ణారెడ్డి మృతి పట్ల ప్రస్తుత ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పన రఘు, బి.రమేష్ బాబు, పలువురు సీనియర్ వైద్యులు సంతాపం తెలిపారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



మారంపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మోతాదుకు మించి కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని మారంపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ నాట్లు వేసిన 40 రోజులు తర్వాత కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దని రైతులకు సూచించారు. గుళికలు వేసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణంరాజు, లక్ష్మీపతిరాజు, ఆర్బీకే అసిస్టెంట్ జె.సతీష్, ఏఈవో మాధవ వర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జాన్‌లియో

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థినుల్లో రక్తహీనతను నిర్ధారించడానికి హెచ్‌బీ పరీక్షలు నిర్వహించామని వీవర్స్ కాలనీ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జాన్ లియో తెలిపారు. గురువారం స్థానిక బీవీఆర్ఎంవీ ఉన్నత పాఠశాలలో 10 ఏళ్లు పైబడిడిన విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జాన్ లియో మాట్లాడుతూ రక్తహీనత కలిగిన విద్యార్థినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీలక్ష్మీబాయి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



ఉలిశెట్టివారి ఆత్మీయ సమ్మేళనంలో పాదపూజ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సంక్రాంతి నేపథ్యం నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలలో స్థిరపడిన ఉలిశెట్టి కుటుంబ సభ్యులంతా ఒక్క చోటకు చేరారు. గ్రామానికి చెందిన ఉలిశెట్టి శ్రీనివాసు, నాగరాజు ఆధ్వర్యంలో ఉలిశెట్టి కుటుంబాల 3వ ఆత్మీయ కలయికను స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన పెద్దలు, తల్లిదండ్రులందరికీ ఉలిశెట్టి సోదరులు పాదపూజను నిర్వహించారు. పేదలకు పలు సహాయ సహకారాలను అందించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ స్వరాజ్యం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కడియద్ద గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ స్వరాజ్యం వచ్చిందని, అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో మన బడి నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకొచ్చిన మార్పులతో విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని, ఆ కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా హాజరు శాతం పెరిగిందని తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులు అమ్మ ఒడి, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ ఇలా అనేక రకాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు అనేక హామీలిచ్చి వాటిని గాలికొదిలేరన్నారు. సీఎం జగన్ ఎంతో చిత్తశుద్ధితో పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. తద్వారా ఆయన పాలనలో పనిచేస్తున్న తమకు మంచి పేరు వస్తుందన్నారు. చిరంజీవి ద్వారా వచ్చిన సినిమా ఫాలోయింగ్, సామాజికవర్గ ఫాలోయింగ్‌ను చూసి పవన్ మురిసిపోతున్నాడన్నారు. గతంలో పీఆర్పీకి వచ్చిన సీట్లు కూడా పవన్‌కు రావని ఎద్దేవా చేశారు. నాడు రాజకీయాలు తమకు కలిసి రావని భావించి చిరంజీవి పీఆర్పీని కాంగ్రెస్‌లో విలీనం చేశారన్నారు. అయితే, పీఆర్పీ విలీనానికి కారణమైన వారి అంతు చూస్తానంటూ పవన్ ప్రగల్భాలు పలికారన్నారు. రాజకీయంగా లక్ష్యం లేకపోవడంతో పాటు సొంత సామాజికవర్గంలోని యువతను నాశనం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు దుయ్యబట్టారు. చంద్రబాబు వాడుకుని వదిలేయడం తప్ప ఏమి చేయలేడనే విషయాన్ని పవన్ గుర్తించాలన్నారు. నాడు చంద్రబాబు...నేడు జగన్ పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అటువంటి పాలనను దించడానికి పవన్ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అయితే, రాబోయే ఎన్నికలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెత్తం దారులకు, పేదలకు మధ్య జరిగే యుద్ధంలా అభివర్ణించారన్నారు. ఈ యుద్ధంలో సీఎం జగన్‌కు ఓటేస్తారో...? పెత్తందారులకు ఓటేస్తారో ప్రజలే తేల్చుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ యాతం కోటేశ్వరి, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు దారపురెడ్డి దుర్గాదేవి, మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, సొసైటీ చైర్మన్‌లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, చిక్కాల సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, పీఆర్ ఏఈ శ్రీనివాస్, హౌసింగ్‌ఏఈ వైవి.వెంకట్రావు, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, పంచాయతీ ఈవో టి.శేషుబాబు, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు ముప్పిడి సంపత్‌కుమార్, కొల్లా విజయలక్ష్మీకుమారి, యాతం బూరయ్య, పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య), పాకనాటి తాతాజీ, దారపురెడ్డి శ్రీనివాస్, మేణ్ణి రామారావు, కర్రి సుధాకర్‌రెడ్డి, అడ్డాల నరసింహారావు, కారింకి వీర్రాజు, ప్రధానోపాధ్యాయుడు దాసం వీవీఎస్ఎన్.మూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దర్శిపర్రుకు జలజీవన్‌మిషన్ ద్వారా 1.22 కోట్లు మంజూరు



జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా దర్శిపర్రు చేరిన డిజిటల్ పైపులైన్లు

పెంటపాడు: దర్శిపర్రు గ్రామానికి జలజీవన్‌మిషన్ ద్వారా రూ. 1.22 కోట్లు నిధులు మంజూరు అయినట్లు గ్రామ ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 1506 కుటుంబాలకు 1078 ఇళ్లు ఉన్నాయన్నారు. సుమారు 3.7 వేలమీటర్లు మేర డిజిటల్ పైపులైన్లు వేసేందుకు మోటీరియల్ గ్రామం చేరిందన్నారు. గ్రామంలో వీధి కొళాయిలు లేకుండా అడిగిన వారందరికి జలజీవన్‌మిషన్‌లో కొళాయిలు వేసేందుకు పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇచ్చారన్నారు. ఈ సొమ్ముతో 20 కెఎల్ కలిగిన ఓహెచ్ఎస్ఆర్, ఒక మైక్రోఫిల్టర్, ఇతర పరికరాలు వేయనున్నట్లు నీరీక్షణరావు తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామ సభలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో గ్రామానికి ఇంత కాలానికి భారీగా నిధులు మంజూరు చేసినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి



వేల్పూరులో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంపై జరిగిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

తణుకు టౌన్: నవరత్నాలు, పేదలరికీ ఇళ్ల పథకంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌ల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులందరూ ఈనెల 26,27 తేదీల్లో గృహాలను నిర్మించుకునేలా వలంటీర్లు కృషి చేయాలని మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు కోరారు. గురువారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని పీబీఆర్ గ్రౌండ్‌లో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ అధ్యక్షతన జరిగిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులు, వలంటీర్లకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ వలంటీర్లు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా చైతన్యవంతం చేయాలని కోరారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారు కాంట్రాక్టర్‌ను నియమించుకోవాలని కోరారు. ఈ నెల 20, 21 వ తేదీల్లో వలంటీర్లు, లబ్ధిదారులు సమావేశాలు నిర్వహించుకుని ఇళ్ల నిర్మాణాలపై విధి విధానాలను రూపొందించుకోవాలని కోరారు. ఈనెల 23వ తేదీన వేల్పూరు గ్రామ సచివాలయాల్లో ఐసీఐసీఐ బ్యాంక్ వారు బ్యాంక్ ఖాతాల ఏర్పాటుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ ద్వారా ఇళ్లు నిర్మించుకునేవారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో టీఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, గ్రామ కార్యదర్శి ఎంయూ శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది, డ్వాక్రా సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

జింక్ లోపానికి, అగ్గి తెగులుకు తేడా తెలుసుకోవాలి



వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

యలమంచిలి: మండలంలోని పలు గ్రామాలలో దాళ్వా పంటలో జింక్ ధాతు లోపం కనిపిస్తుందని, దీనినే కొంతమంది రైతులు అగ్గితెగులుగా భావించి అగ్గితెగులు నివారణ మందులు పిచికారి చేస్తున్నారని, ఆ విధంగా చేయవద్దని నరసాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఈద అనిలకుమారి కోరారు. యలమంచిలి, చించినాడ గ్రామాలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జింక్ లోపం వచ్చిన వరి కంకి పై నుంచి మూడు లేదా నాలుగు ఆకుల మధ్యలో ఈనె పాలిపోతుందన్నారు. నాట్లు పూర్తయిన రెండు నుంచి నాలుగు వారాలలో ముదురు ఆకు చివరలో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు కనపడతాయన్నారు. ఆకులు చిన్నవిగా పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయన్నారు. మొక్కలు సరిగా దుబ్బు చేయవన్నారు. ఈ లోపం కనిపించగానే కొంతమంది రైతులు అగ్గితెగులుగా భావించి నివారణ మందులు పిచికారి చేస్తున్నారన్నారు. కానీ ఈ లక్షణాలను జింక్ ధాతు లోపంగా భావించి నివారణకు లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి వారం వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి, అగ్రికల్చరల్ అసిస్టెంట్స్ స్వప్న, నవ్య పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక



అత్తిలి మండలం బల్లిపాడు హైస్కూల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో గురువులతో విద్యార్థులు

అత్తిలి: బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2005–06 బ్యాచ్‌లో పదో తరగతి విద్యార్థులు గురువారం పాఠశాలలో కలుసుకొని సందడి చేశారు. ఆనాటి గురువులను సన్మానించి, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్, ఆనాటి గురువులు వీవీ సుబ్బారావు, ఐఎల్ఎన్ రాజు, వై గణపతి, సిహెచ్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్, చైర్ బహూకరణ

మొగల్తూరు: స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1997–98 బ్యాచ్ విద్యార్థులు ప్రింటర్, చైర్‌ను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ మూర్తి రాజుకు అందించారు. బహూకరించిన వాటిని పాఠశాల అవసరాలకు వాడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రామరాజు, బి.ప్రసాద్, బ్రహ్మయ్య, వై.జాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఇన్సూరెన్స్ అందజేత

పాలకొల్లు సెంట్రల్: రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలసీ దారుని కుటుంబ సభ్యులైన నామినీకి రూ. 15 లక్షలు చెక్‌ను అందించినట్లు ది న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సీనియర్ డివిజనల్ మేనేజర్ బీఎస్‌జీకే మోహన్ గురువారం తెలిపారు. గతంలో పాలకొల్లు ది న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీలో పోడూరు మండలం గుమ్ములూరు గ్రామం కొమ్మువారి పాలెం ప్రాంతానికి చెందిన కుడిపూడి పాండురంగారావు గూడ్స్ కొరియర్ వాహనానికి కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. కొంత కాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలసీ దారుడు మృతి చెందడంతో డ్రైవర్ మరియు ఓనర్ పర్సనల్ యాక్సిడెంట్ కవరేజ్ రూ. 15 లక్షలు వచ్చింది. పాలసీదారుడు నామినీ అయిన అతని భార్య కుడిపూడి లక్ష్మీకి చెక్‌ను అందజేసినట్లు తెలిపారు.

22న శ్రీశైలం కర్ణభక్త సత్రం కమిటీ మహాజన సభ

పాలకొల్లు సెంట్రల్: శ్రీ కర్ణభక్త సమాజ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశైలం సత్రం కమిటీ మహాజన సభ నిర్వహించనున్నట్లు సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి శాగా రాంబాబు గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పాలకొల్లు పట్టణంలోని అద్దేపల్లి వారి సత్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సత్రంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు, నూతన కమిటీలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సత్రం గౌరవ అధ్యక్షులు శలా కోటి వీరయ్య, అధ్యక్షులు పొన్నా మల్లికార్జునరావులు పాల్గొంటారన్నారు. కర్ణభక్త సంఘం సభ్యులు, కమిటీ సభ్యులు అందరూ ఈ సమావేశంలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతరలు



పాలమూరులో భక్తులు నిప్పులగుండం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలమూరు గ్రామంలో ఉన్న శ్రీ మారెమ్మ, శ్రీ నిలువులమ్మ, శ్రీ మహంకాళమ్మ వార్ల జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఊయల స్తంభాల వద్ద అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహించారు. సుమారు 150 మంది భక్తులు నిప్పులగుండం తొక్కారు. అనంతరం అమ్మవార్లను గుడికి సాగనంపారు. అనంతరం అమ్మవార్లకు భక్తులు అందజేసిన చీరలను వేలం వేశారు. ఈ చీరలు పాడుకోవడానికి మహిళలు పోటీ పడ్డారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పణతుల వీరాస్వామి, ఉపాధ్యక్షుడు పాలా విజయ భాస్కర్, కార్యదర్శి పంచదార అన్నవరం పాల్గొన్నారు.

కొమ్ముచిక్కాలలో

పోడూరు: మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో శ్రీ కోట్లమ్మవారి జాతర వేడుక బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగల నృత్యాలు, మేళతాళ వాయిద్యాలతో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా చేశారు. గ్రామస్తులు చలివిడి పాన్పులతో నైవేద్యాలు సమర్పించారు. గురువారం తెల్లవారు జాము వరకు జాతర వేడుక జరిగింది. గ్రామస్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ టోర్నమెంట్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 20, 21, 22వ తేదీల్లో అంతర్ జిల్లా 66వ రాష్ట్ర స్థాయి అండర్–14 బాలబాలికల ఫుట్ బాల్ టోర్నమెంట్, ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి బి.జాన్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో, బాలికలకు పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలు ముగింపు రోజు 22వ తేది సాయంత్రం 3 గంటలకు పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌లో జరిగే బహుమతి ప్రదానోత్సవ సభకు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఏలూరు ఎం.పీ కోటగిరి శ్రీధర్, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు) పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

వేమన రచనలు తెలుగు భాషకు ఆభరణాలు



తణుకులో వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అత్తిలి: తన సూటైన పద్యాలతో ప్రజా హృదయాల్లోకి వెళ్లిన జనుల కవి వేమన అని, పండిత, పామరులనే భేదం లేకుండా వేమన పద్యాలు సులువుగా అందరికీ అర్థమౌతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వేమన జయంతి ఉత్సవ సభ నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం దత్ మాట్లాడుతూ వేమన పద్యాలు నేర్చుకుని, అందులో భావాన్ని తెలుసుకోవడం ద్వారా సమాజంలో ఉన్నతస్థితికి చేరుకోగల్గుతారన్నారు. తెలుగు భాషకు ఈయన చేసిన రచనలు ఆభరణాలని పేర్కొన్నారు. జీవితానికి సంబంధించిన అనేక నిత్య సత్యాలను తనదైన శైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి తెలుగువారి హృదయాల్లో చిరస్మరణీయునిగా నిలిచిపోయిన వ్యక్తి శ్రీయోగివేమన అని అన్నారు. సంస్కృత ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులందరూ 108 వేమన పద్యాలు కంఠస్థం చేసి, మాతృభాషా దినోత్సవానికి సిద్ధంగా ఉండాలన్నారు. తెలుగు ఉపాధ్యాయులు ఎస్‌కే షర్మిల, ఆత్మలింగం వేమన కవి రచించిన పద్యాలు సారాంశాన్ని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు వేమన శతకంలో పద్యాలను పఠించారు. ఉపాధ్యాయులు ఈశ్వరరావు, బలరామమూర్తి, హర్షద్ పాల్గొన్నారు.

యోగి వేమన పద్యాలు చిరస్మరణీయం

తణుకు టౌన్: పామరులను సైతం ఆకట్టుకునే రీతిలో ఆట వెలది చందస్సులో అద్భుతమైన వేల కొలది పద్యాలను రాసిన యోగి వేమన చిరస్మరణీయుడని మాతృభాషా పరిరక్షణ సమితి సభ్యుడు పీ నాగభూషణం చెప్పారు. యోగి వేమన జయంతి సందర్భంగా మాతృ భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తణుకు రూరల్ మండలం కోనాలలోని మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వేమన సాహిత్యం, పద్యాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన పద్యాల ఆలపాన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వై.దీప్తి, బాల బాస్కర్, కిర్మయి, కిరణ్‌కుమార్, నాగవల్లి, సాయి కృష్ణ, పాల్గొన్నారు.



వేమన జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సంస్కృత ఉపాధ్యాయులు పురుషోత్తం



కోనాల పాఠశాలలో వేమన పద్యాలను ఆలపిస్తున్న విద్యార్థినీలు

తణుకులో...

యోగి వేమన జయంతి సందర్భంగా తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో గల యోగి వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తణుకు శశి స్కూల్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్ యోగి వేమన తెలుగు సాహిత్యంలో వేమన పద్యాలు, వాటి విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తమనంపూడి వెంకటరెడ్డి, కర్రి చంటి రెడ్డి, ఆర్తమూరి మణికంఠ రెడ్డి, వేమన సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



యోగి వేమన జయంతి కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు

ఉద్యాన యూనివర్శిటీలో వేమన జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో యోగి వేమన జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా.బి.శ్రీనివాసులు హాజరై యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగి వేమన జీవిత విశేషాలను వివరించారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వేమన పద్యాలు నైతిక విలువలకు ప్రతి రూపాలని, బాల్య కాలంలో నేర్చుకున్న పద్యాలు జీవితంలో అనేక సందర్భాలలో వ్యక్తిత్వ పరిణితికి దోహదపడతాయని వెల్లడించారు. పద్యాలు అంతర్జాతీయ స్థాయిలో 14 భాషల్లోకి అనువదించారని, ఐక్యరాజ్యా సమితివారిచే పద్యాలు ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శశికళ, వైవీ మంగరాజు, ఎస్.బాబు, వీసీఆర్ శ్రీనివాస్, పీఎస్ఎస్ కిరణ్, భరద్వాజ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.